క్లుప్తంగా

కనకమహాలక్ష్మి దేవస్థానంలో తులసి పూజ



తులసిపూజలో సిరులతల్లి

డాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం తులసి పూజ నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో కూడా పలువురు భక్తులు పాల్గొన్నారు. తులసీదళార్చనలో పాల్గొనదలచిన భక్తులు రూ1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ1,000 పూజా రుసుము చెల్లించి పాల్గొనవచ్చునని ఆలయ కార్యనిర్వహణాధికారి కె. శోభారాణి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకోవాలనుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నెంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081 ద్వారా చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈస్టర్ పండగకు 'వాల్తేర్ సెమెట్రీ' సిద్ధం



వాల్తేర్ సిమెట్రీ అధ్యక్షుడు జార్జ్ చీడి

మహారాణిపేట: క్రైస్తవులు అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించే ఈస్టర్ పండగను ఈ నెల 20వ తేదీ ఆదివారం తెల్లవారుజామున 5 గంటల నుంచి ఘనంగా నిర్వహించనున్నట్లు వాల్తేర్ సెమెట్రీ అధ్యక్షుడు జార్జి చీడి తెలిపారు. శనివారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ, సిమెట్రీలోని 30 నుంచి 40 టన్నుల వరకు ఉన్న వ్యర్థాలను లారీల ద్వారా బయటకు తరలించినట్లు చెప్పారు. క్రైస్తవులు వారి ఆత్మీయుల సమాధుల వద్ద ప్రార్థనలు నిర్వహించుకోవడానికి , సమాధులను అలంకరించడానికి వీలుగా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. 20వ తేదీ ఉదయం 5 గంటల నుంచి బీజెడ్ లూథరన్ చర్చి క్వాయిర్ క్రైస్తవ భక్తి గీతాలను ఆలపిస్తారని ఆయన తెలిపారు. సమావేశంలో సెమెట్రీ కార్యదర్శి జి. మాథ్యూ పీటర్, కోశాధికారి జార్జ్ పులెట్ తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారుడికి జాక్‌పాట్



హార్బర్‌లో వలకు చిక్కిన నల్ల చందువాలు

మహారాణిపేట: విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో శనివారం సందడి నెలకొంది. వేటకు వెళ్లిన మత్స్యకారుల వలలకు ఊహించని సంఖ్యలో నల్ల చందువాలు చిక్కాయి. మార్కెట్‌లో మంచి డిమాండ్, అధిక ధర పలికే ఈ చేపలు ఒకేసారి పెద్ద మొత్తంలో లభించడంతో మత్స్యకారుడు మూగి రాముడు ఆనందం వ్యక్తం చేశారు. గతంలో ఇన్ని చేపలు ఒకేసారి లభించలేదని చెప్పారు. ఇతర రాష్ట్రాల్లో ఈ చేపలకు విశేషమైన గిరాకీ ఉండటంతో, స్థానిక వ్యాపారులు కూడా వీటిని కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపారు.

చందనోత్సవానికి బస్సులన్నీ కండిషన్‌లో ఉండాలి

సింహాచలం: ఈ నెల 30న జరిగే శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి చందనోత్సవాన్ని పురస్కరించుకుని సింహాచలం డిపో నుంచి తిరిగే బస్సులన్నీ కండీషన్‌లో ఉండేలా చూడాలని ఆర్టీసీ విశాఖ రీజినల్ మేనేజర్ అప్పలనాయుడు అధికారులను ఆదేశించారు. సింహాచలం డిపోను శనివారం సందర్శించిన ఆయన మాట్లాడుతూ చందనోత్సవాన్ని పురస్కరించుకుని సింహాచలం డిపో 51బస్సులను నడుపుతుందని తెలిపారు. వీటిలో 35బస్సులు కొండదిగువ గోశాల నుంచి సింహగిరిపైకి, పది బస్సులు పాత అడవివరం నుంచి కొత్త టోల్‌గేట్ మీదుగా తిరుగుతాయన్నారు. ఆరు బస్సులు శ్రీనివాసనగర్ నుంచి అడవివరం వరకు తిరుగుతాయని తెలిపారు. దేవస్థానం ముందుగా ఆ బస్సులకు నగదు చెల్లిస్తుండటంతో ఉచిత ప్రయాణమే భక్తులకు ఉంటుందని తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తుగా బస్సులను కండిషన్‌లో ఉంచాలని మెకానికల్ సిబ్బందిని ఆదేశించారు. ఫిట్‌నెస్ సర్టిఫై చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజినీర్లు నాయుడు, కొండలరావు, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్లు ఎం.ఎస్.రావు, ఇక్బాల్, సిబ్బంది పాల్గొన్నారు.

'వాటర్ బెల్' మోగుతోంది...

ప్రతి పాఠశాలలో రోజుకు 3 సార్లు నీళ్లు తాగే ఏర్పాటు

నీళ్లు తాగడం అలవాటు చేస్తున్న ఉపాధ్యాయులు

వేసవిలో విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా చర్యలు



వాటర్‌బెల్ సందర్భంగా విద్యార్థుల చేత నీళ్లు తాగిస్తున్న ఎంజీఎం పాఠశాల హెచ్‌ఎం నాగభూషణ్





ఎండలు మొదలయ్యాయి. వాతావరణం వేడెక్కుతోంది. ఈ పరిస్థితుల్లో విద్యార్థులు డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండేందుకు ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు 'వాటర్ బెల్' పేరిట కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా విద్యార్థులు రోజుకు మూడు సార్లు మంచినీరు తాగేలా చూస్తున్నారు. సరైన మోతాదులో నీటిని తాగడం వల్ల డీహైడ్రేషన్‌కు గురికాకుండా ఉండడమే కాకుండా, పిల్లలు అనేక రుగ్మతలకు దూరం కానున్నారు.

-అల్లిపురం

ఎండాకాలం వచ్చిందంటే చాలు నాలుక తడారిపోతుంది. గుక్కెడు నీరు తాగితే బాగుండు అనిపిస్తుంది. కానీ, ఒక్కోసారి సమయానికి తాగునీరు దొరకదు. ఎన్నోసార్లు కొద్దిపాటి నీళ్లతోనే దాహం తీర్చుకోవాల్సి వస్తుంది. విద్యార్థుల పరిస్థితి మరీ ఇబ్బందిగా ఉంటుంది. ఉదయం పాఠశాలలకు వెళ్లే పిల్లలు చాలామంది ఇంటి నుంచి మంచినీళ్లు తెచ్చుకోరు. ఒకవేళ తెచ్చుకున్నా.. తాగడానికి సమయం దొరక్కపోవడం, వరుసగా తరగతులు జరిగినప్పుడు మధ్యలో వెళ్లి తాగలేని పరిస్థితి ఉంటుంది. ఒకవేళ నీరు బాగా తాగితే మళ్లీ వాష్‌రూమ్‌కు వెళ్లాల్సి వస్తుందనే భయం కూడా వెంటాడుతుంటుంది. వేసవిలో అయితే చాలామంది విద్యార్థులు నీళ్లు తాగక వివిధ రకాల రోగాల బారిన పడే ప్రమాదముంటుంది. తద్వారా బడులకు వెళ్లలేని పరిస్థితులు ఏర్పడడం, చదువులకు ఆటంకం కలగడం.. తిరిగి కోలుకోవడానికి విచ్చలవిడిగా మందులను వాడడం వల్ల విద్యార్థులు మానసిక వేదనకు గురవుతున్నట్టు అనేక సర్వేల్లో వెల్లడవుతున్న విషయం తెలిసిందే.



అల్లిపురం మోడల్ స్కూల్ విద్యార్థులతో మంచినీళ్లు తాగిస్తున్న హెచ్‌ఎం కనకమహాలక్ష్మి

10, 11, 12 గంటలకు..

ప్రస్తుతం వేసవి ప్రారంభమైన నేపథ్యంలో తాగునీరు తీసుకోవడం తప్పనిసరి కాగా, నగరంలోని అన్ని పాఠశాలల్లో 'వాటర్ బెల్' కార్యక్రమం చేపట్టారు. అందులో భాగంగా మంచినీటి ఉపయోగాలు పిల్లలకు వివరిస్తూ.. రోజుకు కనీసం రెండు లీటర్ల నీటిని తాగేలా విద్యార్థులకు ఒక అలవాటుగా మారుస్తున్నారు. అందుకోసం ప్రతి రోజూ పాఠశాలలో ఉదయం 10, 11, 12 గంటలకు నీటి గంట మోగిస్తున్నారు. ఈ స్వల్ప విరామంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు అందరూ కలిసి తప్పనిసరిగా మంచినీరు తాగుతున్నారు.

విద్యార్థులకు సురక్షిత నీరు



విద్యార్థులందరికీ సురక్షిత నీరు అందుబాటులో ఉంచాలని, వాటర్ ప్లాంట్లు పనిచేయకపోతే తక్షణం మరమ్మతులు చేయించాలని, వాటర్ ప్లాంట్ల నుంచి సురక్షిత మంచినీటిని డబ్బాల్లో అందుబాటులో ఉంచాలని ప్రధానోపాధ్యాయులకు సూచించారు. ఉదయం 8 గంటలకే సూర్యుడు సుర్రుమంటున్నాడు. 8 గంటల నుంచి ఎండ తీవ్రత క్రమంగా పెరుగుతూ మధ్యాహ్నానికి తారాస్థాయికి చేరుతోంది. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించడంతో వాటర్ బెల్ విధానం తప్పనిసరిగా అమలు చేయాలని విద్యాశాఖ అధికారులను ఆదేశించింది.

గత ప్రభుత్వ హయాంలో మౌలిక సదుపాయాలు

వైఎస్సార్‌సీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి మనబడి నాడు–నేడు కార్యక్రమం అమలు చేసింది. పాఠశాలల్లో అత్యాధునిక సదుపాయాలతో పాటు విద్యార్థులు సురక్షిత మంచినీరు తాగేలా నీటి శుద్ధి యంత్రాలను సరఫరా చేసింది. పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య ఆధారంగా ఆర్వో ప్లాంట్లను మంజూరు చేసింది. 50 శాతం పాఠశాలల్లో ప్రభుత్వం, మరికొన్ని పాఠశాలల్లో దాతల సహకారంతో ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు చేశారు. ప్రభుత్వం అందించిన ఆర్వో ప్లాంట్లలో కొన్ని మరమ్మతులకు గురికావడంతో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకున్నారు..

డీ హైడ్రేషన్‌కు గురికాకుండా..



వేసవిలో దాహం ఎక్కువగా ఉంటుంది. పిల్లలు దాహంతో అల్లాడిపోతుంటారు. అందుకు వారి దాహం తీర్చడమే కాకుండా, చిన్నారులు డీ హైడ్రేషన్‌కు గురయ్యే ప్రమాదం ఉంది. ఈ సమయంలో వారికి మంచినీరు అందించడం వల్ల ఆ ప్రమాదం తప్పుతుంది. అందుకు తగిన విధంగా ప్రభుత్వం రోజుకు మూడు నీటి గంటలు పెట్టింది. ఆ సమయంలో విద్యార్థులందరూ నీళ్లు తాగుతున్నారు. దీనివలన విద్యార్థులు డీ హైడ్రేషన్‌కు గురికాకుండా ఉండే అవకాశం ఉంది.

– కె. కనకమహాలక్ష్మి, మోడల్ స్కూల్, అల్లిపురం

రోజూ మూడు సార్లు



ప్రతి రోజు మూడు నీటి గంటలు కొడుతున్నారు. ఆ సమయంలో మేం తెచ్చుకున్న నీటిని తాగుతుంటాం. స్కూల్‌లో కూడా నీటిని ఉంచుతున్నారు. ప్రతి రోజు క్రమం తప్పకుండా నీళ్లు తాగుతున్నాం. టీచర్లు దగ్గరుండి నీళ్లు తాగిస్తున్నారు.

– ఎం. ఇషిత, 3వ తరగతి, మోడల్ స్కూల్

నీళ్లు తాగుతున్నాం



ప్రతి రోజు మూడు బెల్లులు కొడుతున్నారు. అప్పుడు నీళ్లు తాగమని మా టీచర్ చెబుతున్నారు. అందరం కలిసి నీళ్లు తాగుతున్నాం. అమ్మ కూడా వాటర్ బాటిల్ పెడుతుంది.

– ఎస్.కె. మైమూషిక్., 1వ తరగతి, మోడల్ స్కూల్

వికసించిన విద్యా కుసుమాలు



విశాఖ ప్రభుత్వ బాలికల కళాశాల

ఇంటర్ సెకండ్ ఇయర్..

బి. శోభారాణి (ఎంపీసీ) : 973
ఎం. మహిత (బైపీసీ): 970
షేక్ షాహిదా (బైపీసీ): 968
టి. స్వాతి (ఒకేషనల్ - ఎంపీహెచ్‌డబ్ల్యూ (ఫీమెల్)): 969
షేక్ జాష్మిన్ (ఒకేషనల్ - ఎంఎల్‌టీ): 967
వైఆర్‌వీడి తనూష్క (ఒకేషనల్ - ఎంపీహెచ్ డబ్ల్యూ (ఫిమేల్)): 964

ఇంటర్ మొదటి సంవత్సరంలో:

జోగ వర్షిణి (ఎంపీసీ): 462/470
వి.వై. తేజశ్వరి (ఎంపీసీ): 453
బి. సువర్ణ (ఎంపీసీ): 450
వి. మేఘన (బైపీసీ): 435
వి. సూర్యబ్రాహ్మణి (బైపీసీ): 422
ఎం.ఎ.ఎల్. చర్మిష (ఒకేషనల్ - ఎంఎల్‌టీ): 481
ఎం. స్నేహ (ఒకేషనల్ - ఎల్ఎల్‌టీ): 481
జి. మౌనిక (ఒకేషనల్ - సిఎస్ఈ): 480

దాబాగార్డెన్స్: విశాఖ ప్రభుత్వ బాలికల కళాశాలలో చదివిన విద్యార్థినులు అద్భుతమైన ఫలితాలు సాధించారు. పేదరికాన్ని జయించి, చదువుకు పేదరికం అడ్డుకాదని నిరూపించారు. కార్పొరేట్ కళాశాలలో చదివే ఆర్థిక స్థోమత లేకపోయినా, ప్రభుత్వ బాలికల కళాశాలలో చదివిన ఈ విద్యార్థినులు కార్పొరేట్ కళాశాలల విద్యార్థులకు ధీటుగా రాణించారు. కూలీ పనులు చేసుకునే తల్లిదండ్రుల ఆశలను నిజం చేశారు. శనివారం విడుదల చేసిన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో దక్షిణ నియోజకవర్గంలోని ప్రభుత్వ బాలికల కళాశాల విద్యార్థినులు తమ సత్తా చాటారు.

విశాఖ ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు)లో మొత్తం 1290 మంది విద్యార్థినులకు గాను 1265 మంది పరీక్షలకు హాజరయ్యారు. వీరిలో ప్రథమ సంవత్సరం విద్యార్థినులు 455 మందికి 246 మంది (54.07%) ఉత్తీర్ణత సాధించారు. ద్వితీయ సంవత్సరం విద్యార్థినులు 388 మందికి 278 మంది (71.65%) ఉత్తీర్ణులయ్యారు. ఒకేషనల్ విభాగంలో ప్రథమ సంవత్సరం 202 మంది విద్యార్థినులకు 188 మంది (93.7%) ఉత్తీర్ణత సాధించారు. ఒకేషనల్ ద్వితీయ సంవత్సరంలో 220 మంది విద్యార్థినులకు 186 మంది (84.5%) ఉత్తీర్ణులయ్యారు. మొత్తంగా జనరల్ , ఒకేషనల్ విభాగాల్లో ప్రథమ సంవత్సరం 675 మంది విద్యార్థినులకు 432 మంది (64%) ఉత్తీర్ణులయ్యారు. ద్వితీయ సంవత్సరంలో 590 మంది విద్యార్థినులకు 466 మంది (79%) ఉత్తీర్ణులయ్యారని ప్రిన్సిపల్ వివరించారు. జిల్లాలో ప్రభుత్వ జూనియర్ కళాశాల (బాలికలు) ప్రథమ స్థానంలో నిలిచిందని ఆమె పేర్కొన్నారు.

మాస్టర్‌మైండ్స్ విద్యార్థుల అద్భుత విజయం

మహారాణిపేట: ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో మాస్టర్‌మైండ్స్ విద్యార్థులు అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. ఫలితాలు సాధించిన విద్యార్థినీ విద్యార్థులను బ్రాంచ్ అడ్మిన్ ప్రిన్సిపల్ సీహెచ్. అంజిరెడ్డి, బ్రాంచ్ అకడమిక్ ప్రిన్సిపాల్ ఎస్. దినేష్ రెడ్డి అభినందించారు. శనివారం జరిగిన మీడియా సమావేశంలో వారు ఫలితాల వివరాలను తెలియజేశారు. ఇంటర్ మొదటి సంవత్సరంలో బి.గీతిక 491 మార్కులు, కె.చంద్రకళ 491 ,శిల్పా బరిక్ 491, ఎం.కులదీప్ 490, బి.నిత్యశ్రీ 489, బి.మహిమ 488 , ఎం.పూజిత 488, ఎం .చార్మీ 486 , సుంకర భాందవి 486 సాధించారు. రెండో సంవత్సరంలో బి.రక్షిత 1000 మార్కులకు గాను 978 మార్కులు సాధించారు.బి.సాయి సూరజ్ 976, కె.పూర్ణచందు 974, ఎల్ వర్షిణి దేవి 974, ఎస్.కావ్య స్వరూపణి 973, జి.సూర్య హర్ష 970 మార్కులు సాధించారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఐటీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు

మహారాణిపేట: కార్మికులను బానిసలుగా చేసే లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ అఖిల పక్ష కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే 20వ తేదీన అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నర్సింగరావు పిలుపునిచ్చారు. జగదాంబ వద్ద గల సీఐటీయూ ఆఫీసులో లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, మే 20 అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని వేసిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. వారి లాభాల కోసమే ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరణ చేస్తుందన్నారు. బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్నటువంటి 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్పు చేయడం దుర్మార్గమన్నారు. ఈ కోడ్స్ అమలు జరిగితే కార్మికులు బానిసలుగా మారతారన్నారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ మే 20న సమ్మెకు పిలుపునిచ్చామన్నారు. ఈ సమ్మెను విజయవంతం చేయడం ద్వారా మోదీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు కేఎం శ్రీనివాసరావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, కోశాధికారి జ్యోతీశ్వరరావు, జిల్లా కార్యదర్శులు బి.జగన్, జి. అప్పలరాజు, పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కో కన్వీనర్ కుమార మంగళం తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ అడుగుజాడల్లో నడవాలి



మాట్లాడుతున్న కాలేజీ ప్రిన్సిపాల్ సింహాద్రి నాయుడు, చిత్రంలో సీఐ లూథర్ బాబు

మహారాణిపేట: భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ 134వ జయంతి కార్యక్రమం శనివారం ఏవీఎన్ కాలేజీలో జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాలేజీ ప్రిన్సిపాల్ ఎం. సింహాద్రి నాయుడు మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ ఆశయాలను, జీవిత చరిత్రను స్ఫూర్తిగా తీసుకొని ప్రతి విద్యార్థి దేశ ప్రగతికి పాటుపడాలన్నారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సీఐ బి. లూథర్ బాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో ఉన్న విద్యను అభ్యసిస్తూ అంబేడ్కర్ ఆశయాలను స్ఫూర్తిదాయకంగా తీసుకొని దేశ ఔన్నత్యానికి పాటుపడాలని తెలియజేశారు. మరొక ముఖ్య అతిథి, పొలిటికల్ సైన్స్ అండ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ హెడ్ ఆఫ్ ది డిపార్ట్‌మెంట్, ఆంధ్ర యూనివర్సిటీ ప్రొఫెసర్ ప్రేమానందం, కళాశాల పొలిటికల్ సైన్స్ విభాగాధిపతి జె. రామారావు , అధ్యాపకులు కెప్టెన్ డాక్టర్ జి. సునీత, డి. గాయత్రి, కె. ఇందిర, విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఇసుకకొండకు పోటెత్తిన భక్తులు



స్వామివారికి పూజలు చేస్తున్న అర్చకుడు



సామూహిక వ్రతంలో పాల్గొన్న భక్తులు

దాబాగార్డెన్స్: నగరంలోని ఇసుకకొండ (బాబాజీ కొండ)పై వెలసిన రమా సహిత సత్యనారాయణ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. చైత్ర పౌర్ణమి సందర్భంగా స్వామికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు జరిపారు. వేకువజాము 4 గంటల నుంచే భక్తులు స్వామి దర్శనానికి బారులు తీరారు. నగరం నుంచే కాక ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు స్వామి దర్శనానికి తరలివచ్చారు. ఆలయ మండపంలో సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలు జరిగాయి. ధ్వజస్తంభం చుట్టూ భక్తులు ప్రదక్షిణలు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి టి. రాజగోపాల్‌రెడ్డి ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఎండ తీవ్రత దృష్ట్యా దేవస్థానం మంచినీటిని అందజేసింది, ఉచిత ప్రసాదం పంపిణీ చేశారు. పలువురు ప్రముఖులు స్వామిని దర్శించుకున్నారు.

పూర్ణామార్కెట్‌ను సందర్శించిన సీపీ



పూర్ణామార్కెట్ వద్ద కార్ల పార్కింగ్ స్థలాన్ని పరిశీలిస్తున్న సీపీ శంఖబ్రత బాగ్చి

జగదాంబ: నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి శనివారం మధ్యాహ్నం పూర్ణామార్కెట్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మార్కెట్ వద్ద పార్కింగ్ స్థలం నుంచి అరటిపండ్ల సందు వరకు ఉన్న దుకాణాలను ఆయన పరిశీలించారు. సీఐ జీడీబాబు సీపీకి కార్ల పార్కింగ్, దుకాణాలను వెనక్కి పెట్టించిన వివరాలను వివరించారు. అనంతరం సీపీ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని స్ప్రింగ్ రోడ్డులో పర్యటించి దుకాణాలు, వాహనాల పార్కింగ్‌ను పరిశీలించారు. అనధికార పార్కింగ్‌లు లేకుండా చర్యలు తీసుకోవాలని సంబంధిత ట్రాఫిక్ సీఐకి ఆదేశించారు. ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా వాహనాల రాకపోకలకు అంతరాయం కలగకుండా చూడాలని సూచించారు. కార్ల పార్కింగ్‌కు ముందు రోడ్డుపై ఎటువంటి దుకాణాలు లేకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలని వన్ టౌన్ సీఐకి ఆదేశించారు. ఫుట్‌పాత్‌లపై కూడా ఆక్రమణలు లేకుండా చూసుకోవాలని ఆయన అన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏడీసీపీ ప్రవీణ్ కుమార్, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా సీపీఐ నిరసన



వక్ఫ్‌బోర్డు బిల్లు ప్రతులను దహనం చేస్తున్న నాయకులు

సీతమ్మధార: రాజ్యాంగానికి విరుద్ధంగా భారత పార్లమెంటులో వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని చేయడాన్ని, దానిని అమలు చేయడాన్ని వ్యతిరేకిస్తూ సీపీఐ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో సీపీఐ విశాఖ జిల్లా సమితి ఆధ్వర్యంలో శనివారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆందోళన నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ, ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి భిన్నంగా నరేంద్ర మోదీ ప్రభుత్వం వక్ఫ్ బోర్డు సవరణ చట్టాన్ని బలవంతంగా పార్లమెంటులో ఆమోదింపజేసుకోవడం దుర్మార్గమైన చర్య అని అన్నారు. మెజారిటీ ఉందన్న మదంతో ఈ బిల్లును పాస్ చేయడం దారుణమని ఆయన దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఏ. విమల, ఎస్. కె. రెహమాన్, సి.ఎం. క్షేత్ర పాల్, పి. చంద్రశేఖర్, పడాల గోవింద్, పుష్ప ఆదినారాయణ, బి. రాము, ఏఐఎస్ఎఫ్ నాయకులు యు. నాగరాజు, ఎస్. హేమంత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మన్యుసూక్త హోమం



శ్రీఆంజనేయ స్వామి దేవాలయంలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

మహారాణిపేట: మెయిన్ రోడ్డులో ఉన్న శ్రీ ఆంజనేయస్వామి వారి దేవాలయంలో చైత్ర పౌర్ణమి సందర్భంగా శనివారం మన్యుసూక్త హోమం ఘనంగా జరిగింది. ప్రతి నెలా పౌర్ణమి రోజున స్వామివారికి ఈ హోమం నిర్వహిస్తున్నట్లు దేవస్థానం కార్యనిర్వహణాధికారి అల్లు జగన్నాథం ఒక ప్రకటనలో తెలిపారు. నరఘోష, శత్రుఘోష, రుణబాధ, గ్రహదోషాల శాంతి కోసం, అలాగే కార్యసిద్ధి కోసం ఈ హోమం నిర్వహించారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన ఈ హోమంలో పాల్గొన్న భక్తులు రూ.516 రుసుమును దేవస్థానం కౌంటర్‌లో చెల్లించారు. అనంతరం, స్వామి వారి తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు.